సాక్షి
ప్రకాశం
సోమవారం । 20 । నవంబర్ । 2023



అంతర పంటలతో ఆదాయం
అంతర పంటలతో ఆదాయం వస్తుండటంతో వాటి సాగుపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. ఈ ఏడాది 98 వేల ఎకరాల్లో లక్ష్యం కాగా, 30 వేల ఎకరాల్లో సాగు చేశారు.
– 8లో..



క్రికెట్ ఫీవర్
క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ని తిలకించేందుకు జిల్లావ్యాప్తంగా భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఒంగోలు, యర్రగొండపాలెంలో బాలినేని, ఆదిమూలపు మ్యాచ్‌ని తిలకించారు.
– 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
32/24
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

కోర్టు భవనాన్ని పరిశీలించిన హైకోర్టు జడ్జి



భవనాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి మన్మథరావు

సింగరాయకొండ: మండల కేంద్రానికి అదనపు మేజిస్ట్రేట్ కోర్టు మంజూరైన సందర్భంగా తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేసేందుకు పలు భవనాలను ఆదివారం హైకోర్టు జడ్జి డాక్టర్ కె.మన్మథరావు పరిశీలించారు. మండల కాంప్లెక్స్‌లోని గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలతో పాటు కందుకూరు రోడ్డులోని ఆర్‌అండ్‌బీ బంగ్లా భవనాన్ని పరిశీలించారు. కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయ్‌బాబు, అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఎన్.నిఖిల్‌రెడ్డి, సెకండ్ క్లాస్ స్పెషల్ మేజిస్ట్రేట్ దేశంశెట్టి రమేష్, అడ్వకేట్స్ సన్నెబోయిన శ్రీనివాసులు, రాయి రమేష్, బక్కమంతుల వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సీహెచ్ ఉష, పంచాయతీరాజ్ ఏఈ కె.శ్రీహరి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈ నెల 21వ తేదీ ఒంగోలు చేరుకుని పలు కార్యక్రమాలకు హాజరవుతారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా లీడ్ బ్యాంకు వారు నిర్వహించే జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. 11.30కు ప్రకాశం భవనంలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జరిగే ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో పాల్గొంటారు. 22వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఒంగోలు కర్నూలు రోడ్డులోని ఫ్లై ఓవర్ నుంచి అద్దంకి బస్టాండు వరకు జరిగే వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర ర్యాలీలో పాల్గొంటారు. అనంతరం 4 గంటలకు బాపూజీ కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ సీపీ నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభలో పాల్గొంటారు. మిగిలిన సమయంలో తన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఎంపీ అందుబాటులో ఉంటారు.

బ్యాడ్మింటన్‌లో పీపీకి రాష్ట్రస్థాయి బహుమతి



బహుమతులు చూపుతున్న బాలూనాయక్, మనోజ్

మార్కాపురం టౌన్: అద్దంకిలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మార్కాపురం జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.బాలూనాయక్, అద్దంకికి చెందిన ఎస్‌బీఐ ఉద్యోగి మనోజ్‌లు తృతీయ బహుమతి సాధించారు. ఈ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, తదితర ప్రాంతాలకు చెందిన ప్లేయర్లు పాల్గొన్నట్లు నాయక్ తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడి పూజ

● పర్యవేక్షించిన శబరిమల ఆలయ మాజీ ప్రధాన అర్చకులు

ఒంగోలు మెట్రో: హరిహర అయ్యప్ప నిత్య అన్నదానం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక పీవీఆర్ బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్లో అయ్యప్పస్వామి పడిపూజను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అఖిలతంత్రి ప్రచార సభ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన శబరిమల అయ్యప్పస్వామి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఎస్ఈ శంకరన్ నంబూతిరి పర్యవేక్షణలో భక్తిశ్రద్ధలతో పడి పూజ జరిగింది. ఈ సందర్భంగా శంకరన్ నంబూతిరి మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు అన్నదాన ప్రభువైన అయ్యప్పస్వామి అనుగ్రహంతో ఒంగోలు నగర అయ్యప్పస్వాముల సహాయ సహకారాలతో శ్రీ హరిహర అయ్యప్ప నిత్య అన్నదానం ట్రస్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరంలోని మాలధారులు పాల్గొని స్వామివారి పంచామృతాలు, అన్నప్రసాదం స్వీకరించారు.



పడిపూజలో పాల్గొన్న అయ్యప్పస్వామి మాలధారులు

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

కార్తీకమాసంలో పుణ్యక్షేత్రాల సందర్శనకు ఎంతో విశిష్టత ఉంది. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలు రద్దీగా మారనున్నాయి. అలాంటి వాటికి జిల్లాలోని పశ్చిమ ప్రకాశం ప్రత్యేకంగా నిలుస్తోంది. నల్లమల చుట్టూ ఉన్న ప్రముఖ దేవాలయాలతో పాటు ప్రకృతి సోయగాలు భక్తులను మైమరిపిస్తాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఆలయాలన్నీ కార్తీక శోభను సంతరించుకున్నాయి. మొదటి కార్తీక సోమవారం కావడంతో నేటి నుంచి కార్తీక పర్యాటకం ఊపందుకోనుంది.

- కార్తీక పర్యాటకం..!
- పశ్చిమ ప్రకాశంలో ప్రత్యేకం
- నల్లమల చుట్టూ పుణ్యక్షేత్రాలు
- భారీగా సందర్శించనున్న భక్తులు
- నేడు మొదటి కార్తీక సోమవారం
- ఆధ్యాత్మిక కేంద్రాలకు పోటెత్తనున్న జనం
- జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో కార్తీక శోభ
- వనభోజనాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు

మార్కాపురం: కార్తీకమాసం ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమైంది. దీంతో జిల్లావ్యాప్తంగా దేవాలయాల్లో సందడి నెలకొంది. కార్తీకమాసాన్ని భక్తులు, ముఖ్యంగా మహిళలు అత్యంత పవిత్రంగా భావిస్తారు. ప్రధానంగా పుణ్యక్షేత్రాలు, దేవాలయాల్లో పూజలతో పాటు పర్యాటక ప్రాంతాల సందర్శన, వనాల వద్ద సామూహిక భోజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. లక్షలాది మంది ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. జిల్లాలో ఆధ్యాత్మిక సందడి ఎక్కువగానే ఉంటుంది. దీంతో వివిధ సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాల కోసం ప్రాంతాలను నిర్ణయించుకుంటున్నారు. నెలరోజుల పాటు కార్తీక సందడి కొనసాగనుంది.

పశ్చిమాన పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు...
పశ్చిమ ప్రకాశంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. తూర్పున సముద్రతీరం ఉంటే.. పశ్చిమాన నల్లమల అటవీ ప్రాంతం ఉంది. విజ్ఞానాన్ని, ఆహ్లాదాన్ని, ఆధ్యాత్మికతను పంచే ప్రదేశాలు పశ్చిమ ప్రకాశంలో అనేకం ఉన్నాయి. పర్యాటక ప్రదేశాలకు పశ్చిమ ప్రకాశం నెలవని చెప్పుకోవచ్చు. ముఖ్యంగా నాలుగు యుగాల చరిత్ర కలిగిన మార్కాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం, శ్రీశైల మహా పుణ్యక్షేత్రానికి తూర్పు ద్వారంగా ఉన్న త్రిపురాంతకం పుణ్యక్షేత్రం, ప్రకృతి సోయగాల మధ్య ఉన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం ఉన్నాయి. పులులు, నెమళ్లు, జింకలు, దుప్పులు, కొండచిలువలు, చిరుతలు, ఎలుగుబంట్లతో పాటు ఎన్నో వ్యాధుల నివారణకు అవసరమైన వనమూలికలకు ఆలవాలమైన నల్లమల అటవీ ప్రాంతం పశ్చిమ ప్రకాశం ప్రత్యేకత. దోర్నాల నుంచి శ్రీశైలం వరకు, గిద్దలూరు నుంచి శ్రీశైలం వరకు ఉన్న ప్రకృతి అందాలను చూస్తూ చేసే ప్రయాణం మరచిపోలేనిది. ప్రకృతి సోయగాల మధ్య ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరుస్తుంటాయి. అడవుల్లో చెంచులు జీవనం సాగిస్తుంటారు. బిరబిరపారే కృష్ణమ్మ శ్రీశైలం మల్లన్న చెంత పరవళ్లు తొక్కుతుంది. వీరభద్రుని స్థావరాలు, భారీ ఆకృతిలో భైరవ విగ్రహాలు, ప్రాచీన దేవాలయాలు, నల్లమల అటవీ ప్రాంతంలో అనేకం ఉన్నాయి. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఇష్టకామేశ్వరీ ఆలయం చూసి తీరాల్సిందే. ప్రకృతి సిద్ధంగా ఉన్న సినిమా సెట్టింగ్‌లు ఎన్నో దర్శనమిస్తాయి.



నల్లమల అటవీ ప్రాంతం



నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం వ్యూ...

ప్రాచీన శైవక్షేత్రం.. త్రిపురాంతకం...
శ్రీశైల పుణ్యక్షేత్రాల్లో అష్టద్వారాల్లో తూర్పుదిక్కున ఉన్న ద్వారమే త్రిపురాంతకేశ్వరస్వామి క్షేత్రం. శ్రీశైలం దేవస్థానం కంటే ముందుగానే ఈ దేవాలయం నిర్మించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. ఈ ఆలయానికి నాలుగు దిక్కులా మహాద్వారాలు, వాటిపై ద్వార మండపాలు ఉన్నాయి. త్రిపురాంతకేశ్వర ఆలయాన్ని శ్రీచక్రంపై నిర్మించారు. శ్రీచక్రాకృతి అంటే శివపార్వతుల శరీరమని అర్థం. ఆలయం బయట తూర్పువైపు నుంచి లోనికి ప్రవేశించే మార్గం, కుడివైపున ఒక రాతిపై స్వామి వారి పాదముద్రలు ఉన్నాయి. ఇక్కడే ఇంద్రుడు పూజించిన శివలింగం ఉంది. ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి 43 కిలోమీటర్ల దూరంలో, యర్రగొండపాలెం నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉంది. మార్కాపురం నుంచి ప్రతి గంటకు బస్సులు ఉంటాయి. శుక్రవారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. కొండ కింద వివిధ సత్రాలున్నాయి. అలాగే పెద్ద పెద్ద వనాలు కూడా ఉన్నాయి. ఇక్కడ కూడా కార్తీక భోజనాలు నిర్వహించుకోవచ్చు. దేవదాయశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన భైరవకోన...
సీఎస్ పురం సమీపంలో భైరవకోన కూడా ప్రకృతి సిద్ధంగా ఏర్పడింది. కార్తీకమాసంలో అత్యధికంగా సందర్శించే భక్తులతో రద్దీగా మారనుంది. ఇక తూర్పున కొత్తపట్నం, సింగరాయకొండ, పాకల బీచుల్లో కూడా కార్తీక సమారాధన ఏర్పాటు చేసుకోవచ్చు. ఇవి కాకుండా కొన్ని ప్రాంతాల్లో గార్డెన్స్‌లో కూడా వన సమారాధనలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మార్కాపురం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నరసింహస్వామి కొండ కింద కూడా విశాలమైన చెట్ల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్తీక వనభోజనాలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయాల వద్ద వనభోజనాలు నిర్వహించుకోవడం వలన స్వామివారి సందర్శనతో పాటు సామూహికంగా అందరితో కలిసి భోజనాలు చేసే అవకాశం ఉంటుంది. దీని వలన అందరి మధ్య ఐక్యత పెరుగుతుంది.

కార్తీక మాస పర్వదినాలు...
ఈ నెల 17న నాగులచవితి ఘనంగా జరుపుకున్నారు. నేడు 20వ తేదీ మొదటి కార్తీక సోమవారం. 23న ఏకాదశి, 24న క్షీరాబ్ధి ద్వాదశి, 25న శనిత్రయోదశి, 26న కార్తీక పౌర్ణమి, 27న రెండో కార్తీక సోమవారం, డిసెంబర్ 4న మూడో కార్తీక సోమవారం, డిసెంబర్ 10న నందీశ్వరుని అభిషేకం, 11న నాలుగో కార్తీక సోమవారం, 13న పోలిస్వర్గం లాంటి పర్వదినాలు ఉన్నాయి.



త్రిపురాంతకేశ్వరుని ఆలయం

నెమలిగుండం ప్రత్యేకం...
శ్రీకృష్ణదేవరాయలు సతీమణి వరదరాజమ్మ నిర్మించిన రాష్ట్రంలోనే అతిపెద్దదైన కంభం చెరువు, ప్రకృతి సోయగాల నడుమ జలజల ప్రవహించే గుండ్లకమ్మ పరవళ్లతో రాచర్ల మండలంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి వారి ఆలయం ఉన్నాయి. ఆలయ పరిసరాల్లోని ప్రదేశాలు ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగిస్తాయి. విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచుతాయి. కార్తీక వనభోజనాలను దేవదాయశాఖ అనుమతితో నిర్వహించుకోవచ్చు. మార్కాపురం నుంచి శ్రీశైలానికి ప్రతి గంటకు ఆర్టీసీ బస్సులు ఉంటాయి. ఒంగోలు నుంచి 170 కిలోమీటర్ల దూరంలో శ్రీశైలం ఉంటుంది. రాష్ట్రంలోని వివిధ డిపోల బస్సులు ఒంగోలు – మార్కాపురం మీదుగా శ్రీశైలం వెళ్తాయి. శ్రీశైలంలో కూడా కార్తీక వనసమారాధనలు నిర్వహించుకోవచ్చు.

మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. నాలుగు యుగాల్లో స్వామివారి ఆలయం ఉన్నట్లు పురాణాల్లో పేర్కొన్నారు. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో నిర్మించిన ఈ దేవాలయంలో 18 శాసనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆలయంలో నాలుగు రాజగోపురాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

కార్తీక వనభోజనాలకు ఎంతో విశిష్టత



కార్తీకమాసం అంటేనే ఆధ్యాత్మికతతో పాటు వనభోజనాలు ప్రత్యేకం. ఇందులో ప్రతిరోజూ ఒక పర్వదినమే. ఉదయాన్నే తలస్నానం చేసి శివారాధన చేస్తే చాలామంచిది. ముఖ్యంగా కార్తీక సోమవారం ఏకాదశి, కార్తీక పౌర్ణమి, మాస శివరాత్రి రోజున ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అనేక పండుగలు ఉన్నప్పటికీ కార్తీక మాసంలో వన భోజనాలకు ఉన్న ప్రత్యేకత ఏ పండుగకూ లేదు. అందరూ కలిసి ఒకచోట చేరి భోజనాలు చేయడం ఒక మంచి అనుభూతి.

– జీఎల్ రమేష్‌బాబు, తెలుగు ఉపాధ్యాయుడు, జెడ్పీ బాలుర పాఠశాల

భక్తిశ్రద్ధలతో శ్రీగిరి ప్రదక్షిణ



నృత్య ప్రదర్శనతో శ్రీగిరి ప్రదక్షిణ చేస్తున్న నాట్యగురువు డాక్టర్ పోలూరి, పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా వెంకటేశ్వరస్వామివారి నక్షత్రం శ్రవణా నక్షత్రం రోజున గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న విషయం విధితమే. అందులో భాగంగా ఆదివారం గిరి ప్రదక్షిణను అత్యంత భక్తిశ్రద్ధలతో శోభాయమానంగా నిర్వహించారు. కార్తీకమాసం కోటి సోమవారం పర్వదినం సందర్భంగా వందలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. గరుత్మంతుడు, హనుమంతుడు, శంఖు, చక్ర నామాలను చేతబట్టి గోవిందనామాలు స్మరిస్తూ కాలినడకన గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. గోవింద నామస్మరణతో నగరపౌరులు పునీతులయ్యారు. గిరిప్రదక్షిణలో ప్రత్యేక ఆకర్షణగా నరసరావుపేటకు చెందిన నాట్యగురువు డాక్టర్ పోలూరి కృష్ణవాసుశ్రీకాంత్ నృత్యం చేశారు. గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదరునికి ప్రదక్షిణ చేసినట్లుగా తులసిమాలగా స్వామివారి భక్తులు కనిపించారని, సమాజంలో హిందుత్వ భావనలు తగ్గిపోతున్న సమయంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీగిరి శ్రీ వెంకటేశ్వరస్వామివారిని దర్శించాలని భావించే ప్రతిఒక్కరూ గిరి ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించాలనే తలంపు చేయాలని విజ్ఞప్తి చేశారు.

చీమకుర్తిలో అయ్యప్పస్వామి కలశ ప్రాణ ప్రతిష్ఠ

చీమకుర్తి: చీమకుర్తి హరిహరక్షేత్రంలో ఆదివారం అయ్యప్పస్వామి కలశ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులతో పాటు టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ సమక్షంలో అయ్యప్పస్వామికి విశేష అభిషేకాలు చేసి కలశ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిహరక్షేత్రంలోని సకల దేవతామూర్తులకు పూజలు చేశారు. అనంతరం సర్వ మాలధారులకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిద్దా పాండురంగారావు, కుటుంబ సభ్యులతో పాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న శిద్దా సుధీర్, రాఘవరావు

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



దేవకుమారి, రాజకుమారిని సత్కరిస్తున్న మహిళాభ్యుదయ సమితి, నరసం ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళాభ్యుదయ సమితి, నరసం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ ముఖ్య అతిథిగా పాల్గొనగా, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి అధ్యక్షత వహించారు. బీరం అరుణ సభాహ్వానం పలికి కార్యక్రమాన్ని ప్రారంభించగా, అరుణ మాట్లాడుతూ మహిళలకు స్ఫూర్తి ప్రదాత, ఆదర్శ మహిళ, ఉక్కు మహిళగా ఖ్యాతిగాంచిన దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పుట్టినరోజున నగరంలో ప్రముఖ మహిళలను సత్కరించడం ఆనందదాయకమని అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ మహిళా న్యాయవాది, సమాజ సేవకురాలు దేవకుమారితో పాటు ప్రముఖ గాయని, ఉపాధ్యాయిని, మున్నంగి ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మున్నంగి రాజకుమారిని ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉప గ్రంథాలయ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, లైబ్రేరియన్ సంపూర్ణ, నరసం ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్యకుమారి, కే శాంతిలత, నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్ బాబు, నాళం నరసమ్మ, దర్శి చిరంజీవి, మామూర్తి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య తదితరులు పాల్గొని తమ సందేశాలను అందించారు. పట్టాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు మార్నెళ్ల సుబ్బారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహబూబ్‌బాషా వారి సంస్థ తరపున విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జనగళం



ఆరోగ్యశ్రీ ద్వారా పునర్జన్మ ప్రసాదించారు

నేను నాలుగు నెలల కిందట గుండె సంబంధిత అనారోగ్యానికి గురయ్యాను. గుండె బలంగా ఉండాలంటే లోపల మిషన్ ఏర్పాటు చేయాలని వైద్యులు సూచించారు. అందుకు రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. అంత స్థోమత లేకపోవడంతో మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దృష్టికి నా కుటుంబ సభ్యులు సమస్యను తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఆరోగ్యశ్రీ ద్వారా సీఎంఓ ఆఫీస్ నుంచి రూ.4 లక్షలు మంజూరు చేయించారు. విజయవాడ మణిపాల్ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స చేశారు. గుండెకు మిషన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నేను ఆరోగ్యంగా ఉన్నాను. పేదలను ఆదుకునేందుకు ఆరోగ్యశ్రీ పథకం ఎంతగానో తోడ్పడుతోంది. ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటా.



– నాగం సుబ్బయ్య, గొట్లగట్టు, కొనకనమిట్ల మండలం



గృహ నిర్మాణంతో స్థిరాస్తి ఏర్పడింది

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూములు కొనుగోలు చేసి మరీ మాకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. నా పేరు మీదనే పట్టా కూడా ఇచ్చారు. అంతేగాకుండా ఇల్లు కట్టుకునేందుకు ఆర్థికసాయం చేశారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేయడంతో మేము సొంతంగా కొంత నగదు వేసుకుని ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాం. దీంతో సుమారు రూ.10 లక్షల విలువైన స్థిరాస్తి ఏర్పడింది. మాలాంటి లబ్ధిదారులందరితో ఏర్పడిన జగనన్న కాలనీలో మౌలిక వసతులు కూడా కల్పించడం ఎంతో సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– భవనం రమాదేవి, అల్లూరు, కొత్తపట్నం మండలం

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వలనే సర్జరీ చేయించుకున్నా...



నేను చాలా పేదవాడిని. మా గ్రామంలో గత అక్టోబర్ 7వ తేదీ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఆ శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నాను. హెర్నియా వ్యాధి ఉందనే అనుమానంతో ఒంగోలు జీజీహెచ్‌కి రిఫర్ చేశారు. అక్కడ వైద్య పరీక్షలు చేసి హెర్నియా వ్యాధి ఉందని నిర్ధారించారు. సర్జరీ ఖర్చు రూ.40 వేల వరకూ అవుతుందని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు సహాయంతో డాక్టర్లు ఉచితంగా సర్జరీ చేశారు. మందులు కూడా ఉచితంగా అందించారు. ప్రస్తుతం నేను ఆరోగ్యంగా ఉన్నాను.

– కోట రామచంద్రరావు, మడనూరు, కొత్తపట్నం మండలం

సొంతింటి కల నెరవేరింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా సొంతింటి కలను నెరవేర్చారు. ఇల్లు కట్టుకునేందుకు చీమకుర్తి పరిధిలోని గంగవరం జగనన్నకాలనీ లే అవుట్‌లో ఒక సెంటు స్థలం కేటాయించారు. అందులో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. దాంతో పాటు కొంత సొంత డబ్బు వేసుకుని ఇల్లు కట్టుకున్నాం. నిర్మాణం పూర్తి కావచ్చింది. ఇప్పటి వరకు అద్దె ఇంట్లో ఉండే మేము త్వరలో నూతనంగా నిర్మించుకున్న ఇంట్లోకి వెళ్లనుండటం ఎంతో ఆనందంగా ఉంది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– గువదకట్ల లింగమ్మ, చీమకుర్తి

- అంతర పంటల సాగుపై పెరుగుతున్న ఆసక్తి
- ఈ ఏడాది 98 వేల ఎకరాల్లో సాగు లక్ష్యం
- దీర్ఘ, స్వల్పకాలిక పంటల సాగు
- ఇప్పటికే 30 వేల ఎకరాల్లో సాగు
- జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌పై అవగాహన పెంచుతున్న అధికారులు
- తగ్గుతున్న సాగు ఖర్చులు
- ఆశాజనకంగా దిగుబడులు.. పెరుగుతున్న లాభాలు


యర్రగొండపాలెంలో సాగు చేసిన అంతర పంటలు

అంతర పంటలతో ఆదాయం

ఒంగోలు సెంట్రల్:

అంతర పంటల సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. అంతర పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. పెరుగుతున్న సాగు వ్యయాన్ని అధిగమించి లాభాలు పొందాలంటే అంతర పంటలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రైతులు అంటున్నారు. ప్రధాన పంటల్లో అంతర పంటలను సాగు చేస్తూ అధిక దిగుబడులతో పాటు ఆదాయం గడిస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో రైతులు గతానికి భిన్నంగా అంతర పంటలు సాగుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. గతంలో కంది, వరి, పత్తి, మాత్రమే వేయగా ప్రస్తుతం ఆయా పంటల్లో అంతర పంటలుగా మధ్య సాళ్లలో లేదా గట్లపై దోస, బీర, అలసంద, కాకర, సొర్ర, పెసర, మినుము, గోంగూర, సజ్జ, పొద్దుతిరుగుడు, బెండ, జొన్న, అలసంద, బంతి, మిరప, వంగ, బీర, బెండ, గోరు చిక్కుడు, ఆముదం, వేరుశనగ, చిక్కుడు, రాగులను సాగు చేస్తూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక పద్ధతుల్లో పంటలు పండిస్తున్నారు.

అంతా సేంద్రియమే..

అంతర పంటల సాగుకు సేంద్రియ పద్ధతులు పాటిస్తున్నారు. పశువుల ఎరువుతో పాటు నవధాన్యాలను 25 నుంచి 35 రకాలు వేసి పూతదశలో కలియదున్నడంతో పంటకు కావాల్సిన పోషకాలు అందిస్తాయి. ఘన జీవామృతాలు, కషాయాలు మాత్రమే సస్యరక్షణకు వాడుకుంటారు. జీరో బడ్జెట్ నాచ్యురల్ ఫార్మింగ్ (జెడ్‌బీఎన్ఎఫ్) పాటిస్తుండంతో రైతులకు సాగు ఖర్చు కూడా పూర్తిగా తగ్గిపోతుంది.

98 వేల ఎకరాల్లో లక్ష్యం..

జిల్లాలోని 187 గ్రామ పంచాయతీల్లో 364 పొదుపు సంఘాలతో కలిపి ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటల సాగుకు కృషి చేస్తున్నారు. గత సంవత్సరంలో 40వేల మంది రైతులతో కలిపి 45వేల ఎకరాల్లో అంతర పంటలు సాగు చేసారు. ఈ ఏడాది 49వేల మంది రైతులతో 98 వేల ఎకరాల్లో సాగు చేయించాలన్న లక్ష్యం విధించారు. అయితే ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 22,500 మంది రైతులతో 30వేల ఎకరాల వరకు సాగు చేయించారు. రబీలో మిగిలిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు కృషి చేస్తున్నారు.


కరవదిలో సాగు చేసిన అంతర పంటలు


దోర్నాల మండలం అంతర పంటలలో పక్షులు ఏర్పాటు చేసిన గూళ్లు

అంతర పంటలతో ఎన్నో లాభాలు

అంతర పంటల సాగుతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయి. పంటలు తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం పెంపొందుతుంది. పంట నష్టం నుంచి కాదుకోవచ్చు. వివిధ పంటలు పర్యావరణ సవాళ్లను, హెచ్చుతగ్గులను భిన్నంగా స్పందిస్తాయి. నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది. కలుపు నియంత్రణ ఉంటుంది. రైతుల ఆర్థిక స్థితి గతిని మెరుగుపరుస్తుంది.



కొత్తపట్నంలో అంతర పంటలను పరిశీలించి సూచనలు చేస్తున్న అధికారులు

ఒక పంట నష్టపోతే మరో పంట చేతికి


2008 నుంచి అంతర పంటలు సాగు చేస్తున్నాను. కందిలో దోస, బీర, అలసంద, సొర్ర, పెసర, మినుము, సజ్జ, పొద్దు తిరుగుడు, బెంగ సాగు చేస్తున్నాను. ఒక పంట పోతే మరో పంట చేతికి వస్తుంది. దీంతో నష్టం వాటిల్లే అవకాశాలు లేవు.

– కంటేనేని బాల శేషయ్య, యర్రగొండపాలెం

ఖర్చులు తక్కువ


ఏకకాలంలో రెండు మూడు పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడం వల్ల పెద్దగా ఖర్చులు ఉండవు. 2019 నుంచి అంతర పంటలు వేస్తున్నాం. కందిలో దోస, బీర, అలసంద, పెసర, మినుము, గోంగూర, చిక్కుడు, మొక్కజొన్న, బెండ, ఆముదం వంటివి సాగుచేస్తున్నాం. 30 రకాల వరకు విత్తనాలు వేశాం.

– జి.అనూష, శంకరాపురం, ముండ్లమూరు మండలం

తెగుళ్ల బెడద లేదు


అంతరపంటల సాగుతో ప్రధాన పంటకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. కందిలో అంతర పంటగా దోస, జొన్న, గోంగూర, చిక్కుడు, పొద్దుతిరుగుడు వంటి రకాలు సాగుచేశాం. 2019 నుంచి జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. అధికారులు నిత్యం మాకు సలహాలు సూచనలు ఇస్తున్నారు.

– జి.వెంకటరమణమ్మ, మారెడుపల్లి, దర్శి మండలం

రైతులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నాం


ప్రకృతి వ్యవసాయంలో అంతర పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. దీంతో ఏటా సాగు విస్తీర్ణం పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో అంతర పంటలపై దృష్టి సారిస్తే మరింత ప్రయోజనం ఉండే అవకాశం ఉంది.

– వి.సుభాషిణి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్


కల్యాణోత్సవంలో తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

కనులపండువగా కల్యాణోత్సవం

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణువు ఉత్సవమూర్తుల కల్యాణోత్సవం అర్చకుల వేదమంత్రాల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై ఉంచి ప్రత్యేక పూజల అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ జి.రమణా రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

దొంగలను పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడులో ఆదివారం తెల్లవారుజామున పైపులు పంపుసెట్‌ను దొంగతనం చేసేందుకు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ మోటార్లు, పైపులు, పంపుసెట్లు దొంగతనాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామస్తులు రాత్రిళ్లు కాపలా ఉంటున్నారు. గ్రామానికి చెందిన తిరుపతయ్య శనివారం రాత్రి పొలంలో కాపలాగా ఉండగా ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ క్రేన్‌లో వచ్చి పైపులు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఇది గమనించిన తిరుపతయ్య గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడకు చేరుకొని ట్రాక్టర్‌తో పాటు ఇద్దరు వ్యక్తులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎస్సై సుధాకర్‌ను వివరణ కోరగా..దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు.


పోలీస్‌స్టేషన్ వద్ద గ్రామస్తులు పట్టుకున్న ట్రాక్టర్

టీటీడీ అన్నదానానికి కూరగాయల తరలింపు

మార్టూరు: టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మార్టూరు నుంచి దాతల సాయంతో కూరగాయలు తిరుమలకు పంపించారు. విజయవాడ కూరగాయల మార్కెట్ నుంచి ప్రత్యేకంగా అలంకరించిన కూరగాయల లారీ స్థానిక స్టేట్ బ్యాంక్ సెంటర్‌లోకి రాగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఇదే క్రమంలో స్థానిక గ్రానైట్ వ్యాపారులు శ్రీశైలం నిత్యాన్నదానానికి అవసరమైన నిత్యావసర సరుకులను లారీకి నింపగా రెండు లారీలను రెండు ప్రాంతాలకు తరలించారు. ఈసందర్భంగా భక్తులకు టీటీడీ లడ్డు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

అంకాళమ్మ ఆలయంలో హుండీ చోరీ


చోరీ తీరుపై వివరాలు సేకరిస్తున్న ఎస్సై అనిల్‌కుమార్


వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని అరివేముల సమీపంలోని అంకాళమ్మ ఆలయ హుండీలోని నగదు చోరీకి గురైంది. ఈ ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. ఎస్సై పి.అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రావులక్ష్మి అంకాళమ్మ ఆలయాన్ని శుభ్రం చేసేందుకు ఆదివారం ఉదయం ఆలయం వద్దకు వెళ్లింది. ఈ సందర్భంలో ఆలయ తలుపులకు వేసిన తాళం పగులగొట్టి ఉండటంతోపాటు హుండీ పగులగొట్టి ఉండటం చూసి గ్రామస్తులకు సమాచారమిచ్చింది. దీనిపై రావులక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్సై అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన ఆలయాన్ని ఒంగోలుకు చెందిన క్లూస్ టీం పరిశీలించి ఆధారాలు సేకరించారు.

జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక


జిల్లా బ్యాడ్మింటన్‌కు ఎంపికైన స్త్రీ, పురుషుల జట్లు

చీమకుర్తి: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు క్రీడా ప్రాంగణంలో జిల్లాస్థాయి స్త్రీ, పురుషుల బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన పురుషుల జట్లలో మురళి, పాచ్చామియా, నాగులమీరా, ఏడుకొండలు, శివమణి, కృష్ణ, వినయ్, రాయుడు, శంకర్, బాలసుబ్రహ్మణం, వంశీకృష్ణ, సంతోష్ ఉన్నారు. స్త్రీల జట్టులో అఖిల, పవిత్ర, అంజలి, దివ్య, అక్షయ, మాధవి, యువశ్రీ, సుబ్బులు, మాధురిక, అమృత ఉన్నారు. ఎంపికైన జట్లను నిర్వాహక కమిటీ సభ్యులు అభినందించారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి


రవాణాశాఖ అధికారుల ర్యాలీ

- రవాణాశాఖ ఉప కమిషనర్ సుశీల

ఒంగోలు: రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల అన్నారు. స్థానిక చర్చిసెంటర్ వద్ద రోడ్డు ట్రాఫిక్ బాధితుల ప్రపంచ జ్ఞాపక దినోత్సవం కార్యక్రమాన్ని రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ చేపట్టిన ర్యాలీని ఒంగోలు రహదారి భద్రతా కమిటీ నోడల్ అధికారి విక్రమ్ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. చర్చిసెంటర్ వద్ద నుంచి మస్తాన్‌దర్గా వరకు తిరిగి అదే మార్గంలో చర్చిసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణతో పాటు ప్రమాద సమయంలో ప్రాణ నష్టం లేకుండా ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రయాణం వైపు దృష్టిసారించాలన్నారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్టు పెట్టుకోవడం బాధ్యతగా భావించడంతో పాటు రోడ్డును వినియోగించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రహదారి ప్రమాదాల్లో యువత ఎక్కువగా మృతి చెందుతున్నారని, ఇది చాలా బాధాకరమన్నారు. యువత దేశానికి శక్తి అని, అటువంటి శక్తి నిర్వీర్యం అయితే దేశానికి తీరని నష్టం కలుగుతుందన్నారు. అందువల్ల యువతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, అందుకు వారిలో చైతన్యాన్ని తీసుకురావాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన ఓ మహిళ తమ కుటుంబం పడుతున్న కష్టాన్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, పలువురు మోటారు వాహనాల తనిఖీ అధికారులు పాల్గొన్నారు.


చర్చి సెంటర్‌లో మానవహారం

క్రికెట్ ఫీవర్..!


ఒంగోలు మినీ స్టేడియంలో మ్యాచ్‌ను తిలకిస్తున్న మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు


మ్యాచ్‌ను ఉత్సాహంగా తిలకిస్తున్న క్రీడాభిమానులు


వైపాలెంలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు: వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఇండియా–ఆస్ట్రేలియా తలపడటంతో జిల్లా వ్యాప్తంగా ఏ ఇద్దరు కూర్చున్నా ఇదే చర్చ నడిచింది. క్రీడాభిమానుల కోసం ప్రభుత్వం ఈసారి జిల్లా కేంద్రాల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి వేల మంది వీక్షించేలా ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, బాలినేని వారి సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలు మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌పై మ్యాచ్ చూసేందుకు క్రీడాభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మినీస్టేడియం క్రికెట్ అభిమానులతో కిక్కిరిసింది. జాతీయ జెండాలను పట్టుకొని స్టేడియంలో ఉత్సాహంగా కనిపించారు. మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చిన వారందరికీ అల్పాహారం ఏర్పాటు చేశారు. పోలీసులు సైతం పార్కింగ్, ఇతర సమస్యలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు బాలినేని ప్రణీత్ రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు మినీ స్టేడియంలో మ్యాచ్‌ను తిలకించారు. స్థానిక రంగారాయుడు చెరువు వద్ద ఉన్న గాంధీపార్కులోని భారీ స్క్రీన్‌పై కూడా మ్యాచ్‌ను క్రీడాభిమానులు ఉత్సాహంగా తిలకించారు. యర్రగొండపాలెంలో గాయత్రి థియేటర్‌లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మ్యాచ్ వీక్షించారు.